
# "మానవులు"

రచన :
బొమ్మ హేమాదేవి



"ఓరేయ్ కృష్ణా!" నందన్‌రావు పిలుపుకి కృష్ణుడు ఓవైపు పలక మీద దిద్దుతోనే—"ఏమిటి నాన్నా?" అని అడిగాడు

"రెండవ ఎక్కం వచ్చిందా?" చేతిలోని గొడుగు మూలనుంచి - ఒంటి మీది కండువా కుర్చీపైన వేసి - కృష్ణుడి పక్కన కూర్చుని - కొడుకుని పిచ్చి మమకారంతో నిమురుతూ అడిగాడు నందనరావు.

"రావడం లేదు."

"రావటం లేదు అంటే ఎటా? నేర్చుకోవాలి నాన్నా! నువ్వు బాగా చదివి గొప్ప వాడివై బాగా డబ్బు సంపాదిస్తే అప్పుడు మనం...."

"ఇప్పుడు నువ్వు సంపాదిస్తున్నావ్‌గా."

"మళ్లీ నేను గూడా సంపాయించటం ఎందుకూ? ఉన్నది మనం ఇద్దరమేగా!"

కృష్ణుడి ప్రశ్నకు నందనరావు అదోలానే ఐపోయాడు. ఉన్నట్టుండి భార్య గుర్తుకు వచ్చింది. అప్పటికప్పుడే యశోద చనిపోయి 5 ఏళ్ళు గడచిపోయాయి. కృష్ణున్ని కని–ఇంక తాను వచ్చిన పని ఐపోయినట్టుగా వెళ్ళిపోయింది. నందనరావుది చిన్న వయస్సే అయినా, కృష్ణుడి కోసమని పెళ్ళిచేసుకోలేదు. పైగా భార్య మృత్యువు చూచాక, ఇంకో భార్య కావాలని గూడా అతనికి అనిపించలేదు.

"నేనేమైనా తప్పుగా మాటాడానా నాన్నా?"

"సంపాదన గురించి కదా మనం అనుకుంటున్నాం?"

"నేను ఎప్పటికీ ఇట్లాగే వుండను_ ముసలితనం వస్తుంది. సంపాయించే శక్తి పోతుంది_అప్పుడు నువ్వే నన్ను..."

ఆల్‌రైట్ - ఆల్‌రైట్ .... నేను చదువుకుంటాను." అని మళ్ళీ -

"నువ్వు ముసలి వాడివి కావటానికి

ఇంకా చాలా సమయం వుంది నాన్నా... నేను కొంచెం ఆలశ్యంగా చదువు మొదలుపెట్టినా ఫరవాలేదు కదా ?" అన్నాడు కృష్ణుడు. కృష్ణుడు వయస్సును మించి మాట్లాడేవాడు. నందనరావుకి చాలా ఆశ్చర్యంగా వుండేది. కొన్ని సార్లు దిగులుగా కూడా వుండేది.

"వీడి తెలివి మండిపోను – వీడితో ఎట్లా" అని

ఇంకో రెండేళ్ళకిగాని కృష్ణుడు చదువు ఆరంభం చేయలేదు. నందనరావైనా కృష్ణుడిని బలవంత పరచలేదు. కొడుకు మీద ఓ రకమైన విశ్వాసం. ఆడు చదవటం ఆరంభం చేస్తే – ఇంక వాగడు అని అట్లాగే బాగా పోటీపడి చదువుకున్నాడు కృష్ణుడు ...... ఫస్టు క్లాసులు, గోల్డుమెడల్స్ – కృష్ణుడికే – దత్తం ఐపోయేవి. నందనరావు సంతోషానికి హద్దులుండేవి కావు

క్రొత్త స్టైల్లో కృష్ణుడు దువ్వుకుంటే—"ఈ స్టైల్ నీకు బాఉంది" నాన్నా" అన్నాడు నందనరావు.

"నీ హేర్ స్టైల్ కూడా బాగా లేదు" అని తండ్రికి గూడా స్టైల్‌గా కృష్ణుడు దువ్వితే – నందనరావు తన ఆఫీసుకి క్రొత్త హేర్ స్టైల్ తోనే వెళ్ళాడు. ఎవరైనా తన వైపు ఆశ్చర్యంగా చూచినట్లు తనకు అనిపించినప్పుడు "మా కృష్ణుడు దువ్వాడు – వాడికి చాలా స్టైల్స్ తెలుసు" అనేవాడు.

కృష్ణుడు మెడిసన్ చదువుతానని అన్నప్పుడు – నందనరావు కొన్ని ట్యూషన్స్ ఏర్పాటు చేసుకున్నాడు... ఓ చెలకపొలం అమ్మివేయాల్సి వచ్చినా – ఓ ఎకరం పొలం ఎట్లాగూ వుంది కదా అని – ఆ చెలకని – కృష్ణుడు చదువు నిమిత్తం అమ్మివేయడం జరిగింది. కొడుకు కోసం బ్రతుకుతున్నట్టుగా ఉండేవాడు ఒక్క-రోజైనా కృష్ణుడు ఏదైనా అడగటం – నందనరావు లేదనటం– జరగలేదు.

ఓరోజు మెడికల్ కాలేజీలో –డ్రామా ఏదో వేస్తున్నారని "నువ్వూరా నాన్నా- చూద్దూవుగాని" అని తండ్రిని తీసుకు వెళ్ళాడు తిరిగి వస్తున్నప్పుడు "ఆ డాన్సు చేసిన అమ్మాయి పేరు ప్రభావతి. మనిషి మంచిదే – తెలివికలది కూడా" అన్నాడు.

"లేకపోతే – ఓ వైపు మెడిసన్ చదువుతూ – అంత చక్కగా డాన్సు చేయగలదా ?" అన్నాడు – కృష్ణుడి అభిప్రాయాన్ని తాను బలపరుస్తో మళ్ళీ నందనరావే – 'ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ రేపు పెట్టుకున్నారట – నన్ను రేపుకూడా రమ్మని – మీ ప్రిన్స్‌పాల్ మరి మరీ చెప్పాడు బాబూ" అన్నాడు నందనరావు దార్లోనే.'

కృష్ణుడు మెడిసిన్ పాసై హౌస్ సర్జన్సీ చేస్తోన్నప్పుడు–దీపావళి పండుగ నాడు–కృష్ణుడికి – తలంటి నందనరావే స్నానం చేయిస్తోంటే – కృష్ణుడు "నాన్నా! ఇప్పుడు నేను పెద్దవాడినైపోయాను కదా – ఇంకా నువ్వే ఎందుకు స్నానం చేయిసుంటావు?" అడిగాడు. కృష్ణుడి కంఠం కొత్తరకంగా

ధ్వనించింది. నందనరావు అదేంపట్టించు కోకుండా—

"నువ్వు- M. D. చేయాలి.-మెడిసన్‌లో Ph. D చేయాలి నాన్నా. స్కాలర్ షిప్స్ దొరుకుతున్నాయిగా-ఫారెన్‌కూడా వెళ్ళిరావచ్చు నువ్వు...." కొడుకు వీపు సున్ని పిండితో రుద్దుతూ నందనరావు అంటోన్నప్పుడు-కృష్ణుడు.

"ఇంక ఈ సున్నిపిండి వద్దునాన్నా-సోపు కావాలి. మా స్నేహితులంతా ఎంత చక్కగా సోపుతో రుద్దుకుంటుంటారు. నీకసలు ఏం తెలియదు-" అన్నాడు.

"సోపు చర్మాన్ని పాడు చేస్తుందిరా. ఐనా కావాలంటున్నావ్‌గా తెస్తానులే-" అన్నాడు....

స్నానం ఐపోయాక- తండ్రి కొడుకులు కలసి - పూజ చేశారు. పండుగపూట - చేసుకున్న పిండి వంటలతో భోజనం కూడా చేశారు భోజనం తర్వాతకృష్ణుడు బైటకు వెళ్ళిపోయాడు నందనరావు పేపరు చదువుతూ. చదువుతూ అల్లాగే కొంచెం అలసటగా నిదురపోయాడు.

నందనరావు ఎవరింటికి వెళ్ళేవాడు కాదు - తన ఉద్యోగం-ఇల్లు-కృష్ణుడు-అంతే అతని ప్రపంచం. నందనరావింటికైనా ఎవరూ వచ్చేవారు కాదు. ఇంట్లో ఆడవాళ్ళు కాని - ఇంకా పిల్లలు గాని లేకపోవటం వల్ల కొంత-నందనరావు ఉండే ఇల్లు - సిటీకి దూరంలో గూడా వుంటుంది. పెద్ద ఉద్యోగస్థుడు-డబ్బు - హోదా గలవాడు కూడా కాదు కాబట్టి - ఎవరూ నందనరావుని పట్టించుకునే వారు కాదు. మిగతా ప్రపంచానికి ఆ తండ్రి కొడుకులు దూరంగా ఉన్నట్టుండేవారు.

పండుగనాడు - కృష్ణుడు ఇంకా ఇంటికి రాలేదు. ఉదయం అనగా తిని వెళ్ళినవాడు - రాత్రైనా రాకపోతే - పిక్చర్‌కుగాని వెళ్ళాడేమో అనుకున్నాడు నందనరావు.తలుపులు తెరుచుకుని బైటికి వచ్చి చూస్తే దీపావళి - దీపాల కాంతులకు పట్టణం మెరిసిపోతున్నట్లుగా కనిపిస్తే కాస్సేపు అలాగే ఆ వెలుగంతా చూస్తూ నిల్చున్నాడు నందనరావు.... ఎందుకో ఆకాశం వైపు చూస్తే మరీ నల్లగా కనిపించింది. అమావాస్య కదా అనుకున్నాడు... ఉన్నట్టుండి చిన్న తుంపర పడటం ఆరంభం కాగానే, 'అబ్బ ఇప్పుడు వర్షం ఏమిటీ ?' అనుకున్నాడు. లోపలి వైపు వెళ్తూ, తలుపు గడియవేసుకుంటూ.... చిటికి చిటికి ఆ తుంపరే గాలివానై లైట్లుఆరిపోయాయి. .... క్షణంలో పట్టణం అంతా చీకట్లో మునిగిపోయింది. నందనరావు-లాంతరు వెలిగించి - కృష్ణుడి రాకకోసం ఎదురు

చూస్తోకూర్చున్నాడు. ఓరాత్రిపూటతలుపు చప్పుడైతే - ఆతురతగా వెళ్ళి తలుపులు తెరిసే-ఎవరో ఓ అబ్బాయి- సైకిల్ మీద- రెయిన్ కోటు వేసుకుని వచ్చాడు—"కృష్ణుడు మీ కిమ్మన్నాడు" అని - ఓ చీటీ ఇచ్చి - వచ్చినంత ఆక స్మాత్తుగానే - వెళ్ళిపోయాడు....నందన రావు ఇంట్లోకి వచ్చి - లాంతర్ వెలు గులో - ఆ ఉత్తరం విప్పి చూసే - అందులో "నాన్నా! నేను ప్రభావతితో వెళ్ళిపోతున్నాను ... నా మనస్సాక్షి అంగీకరించిన మీదట - ఈ పని చేస్తు న్నాను...." అని రాసి వుంది. నందన రావు కొయ్యబారిపోయాడు....

తెల్లవారింది మామూలుగానే.... ఆ బోసిపోయిన ఇంట్లో నందనరావు ఒక్కడే తిరిగాడు వండుకున్నాడు- పళ్ళెంలో వేసుకుని అన్నం కెలికాడు. పని మీదికి వెళ్ళొచ్చాడు.... రాత్రై నప్పుడు దీపం వెలిగించుకున్నాడు

చాలాకాలం తర్వాత మళ్ళీ ఓ చీకటి రాత్రి ...గాలి వాన, చిన్నరకం తుఫా నుగా ఉన్న రాత్రి .. తలుపుల మీద చప్పుడైతే - 'ఎవరా' అనుకుంటూ వెళ్ళి తలుపులు తెరిసే - గుర్తుపట్టలేని మానవాకారం.... "నేను నాన్నా, కృష్ణు డని" అన్నాడు. నందనరావు లాంతరు వెలుగుని పెంచి - దాన్ని ఎత్తి ఎదుటి మనిషిముఖంలోకి చూచాడు...కృష్ణుడే... మనిషి అనుభవాల జ్ఞానంతో ఎదిగి పోయి, వయస్సుతో ముదిరిపోయి కని పించాడు . కృష్ణుకి ఒంటి మీదినుంచి నీళ్ళన్నీ కారిపోతున్నాయి .... తలుపుల దగ్గరే నిల్చున్నాడు కృష్ణుడింకా. కృష్ణుకే వైపే చూస్తూ ఎంతో స్తిమితంగా, నందనరావు -

"నా వయసు చాలా ఐపోయింది ... నేను బ్రతికి వుండగా నువ్వు తిరిగి వస్తావో లేదో అనుకున్నాను ఈ ప్రశ్న అడక్కుండానే చచ్చిపోతానేమో నని గూడా అనుకున్నాను..."అని క్షణం ఆగి —

"నువ్వు అడిగిందల్లా నీ కిచ్చాను. నువ్వు చెప్పినట్లుగానే నేను నడుచు కున్నాను నీకు ఏ కొరతా రాకుండా నేను చూసుకున్నాను కదా - మరి నువ్వెందుకట్లా వెళ్ళి పోయావు ?" అడి గాడు కృష్ణుడిని. కొంచెం ఆగి కృష్ణుడు-

"ఇప్పుడు దేనిగురించైనా నేను స్పష్టంగా మాటాడగలను. ఆ విషయం గురించి గూడా - సిగ్గు పడకుండా చెప్ప గలను " అని - "నువ్వు ఆకలై నప్పుడు అన్నం పెట్టావు - ఉండడానికి నీడనిచ్చావు. - కట్టుకోవటానికి గుడ్డ లిచ్చావు - చదువుగూడా చెప్పించావు... ఇవన్నీ నేను అడగకన్నాముందే నువ్వు నాకు సమకూర్చావు....కాని.... వయసొచ్చినా నువ్వు పెళ్ళి చేయలేదు. ఆ అవసరం గురించి- నీతో నేను 'ఆకలైంది అన్నం పెట్టు' అన్నంత చనువుగా,స్పష్టంగాచెప్పలేకపోయాను'. అన్నాడు

కొంచెం సేపటి నిశ్శబ్దం తర్వాత- "లోపలికి రా" అన్నాడు నందనరావు మనసులో వేను కాటోలు అనుకుంటూ.

●